ప్రజాశక్తి
సోమవారం 22 జులై 2024
5
అల్లూరి సీతారామరాజు



నేటి నుంచి శిక్షా సప్తాహ్ : డిఇఒ

ప్రజాశక్తి-పాడేరుటౌన్: జాతీయ విద్యావిధానం 2020 ప్రవేశపెట్టి 4వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు వారం రోజుల పాటు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాలను నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై, దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియచేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికుల భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమాలు పాఠశాలల్లో నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. తొలిరోజు 22న సోమవారం బోధనా సామాగ్రి ప్రదర్శన, రెండో రోజు పునాది అభ్యసన, మూడో రోజు క్రీడా దినోత్సవం, నాలుగో రోజు సాంస్కృతిక దినోత్సవం, ఐదో రోజు సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, స్కిల్ డిజిటల్ ఇన్షియేటివ్ డే, ఆరో రోజు పర్యావరణ పరిరక్షణ దినోత్సవంతో పాటు చివరి రోజు సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహించాలని వివరించారు.

ఉధృతమౌతున్న వరద గోదారి!



కూనవరం వద్ద గోదావరి మహోగ్రరూపం

- భద్రాచలం వద్ద పెరిగిన నీటిమట్టం
- భయం గుప్పెట్లో విలీన మండలాల ప్రజలు
- ఉప్పొంగి ప్రవహిస్తున్న శబరి, సీలేరు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- తీవ్రమౌతున్న ముంపు వాసుల కష్టాలు



ఎటపాక మండలం నెల్లిపాక వీరాయిగూడెం రహదారిపై వరదనీరు

ప్రజాశక్తి-చింతూరు.: వీడకుండా కురుస్తున్న వర్షాలతో గోదారి, దాని ఉపనదులు శబరి, సీలేరు నదులతోపాటు ఏజెన్సీలోని వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జాతీయ రహదారులతో అంతరరాష్ట్ర రహదారులు, గ్రామీణ రోడ్లు కోతకు గురికావడంతో పలు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోగా, రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. చట్టి వద్ద కొమ్మూరు వాగు ఉధృతితో జాతీయ రహదారి 30 వద్ద వరద నీరు చేరి, భద్రాచలం చింతూరు రాజమండ్రి కాకినాడ తదితర ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సులతోపాటు ఇతర వాహనాల రాకపోకలు నిలిచాయి. గోదారి వరదపోటు ప్రభావంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంటపరిధిలో ఇంజరం వద్ద జాతీయ రహదారి ముంపు గురైంది. రెండు రోజులుగా కోయుగూరు వాగు పొంగి ప్రవహించటంతో కల్లేరు మీదుగా ఒడిశాకు వెళ్లే 326 జాతీయ రహదారి కోతకు గురైంది. మండలంలోని చీకటి వాగు, సోకిలేరు, చంద్రవంక వాగులు ఉధృతితో కొమ్మూరు, మామిల్ల గూడెం, రేగులపాడు , బోర్రాయి గూడెం తదితర గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. సోకిలేరు వాగు ఉగ్రరూపంతో 30 గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. చూ టూరు, ముకునూరు, నర్సింగ పేట, జల్లి వారి గూడెం, ఏజీ కోడేరు, తిమ్మిరి గూడెం, కుందలూరు, ఉలుమూరు తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. చింతూరు శబరి నది నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 39.5అడుగులకు చేరింది. చింతూరులో ఎస్ఎంఎస్ గర్ల్స్ హాస్టల్, ఎస్సీ బాయ్స్ హాస్టల్, జిల్లా పరిషత్ పాఠశాల మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలలో వరదపునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. తాలిపేరు ప్రాజెక్టు వద్ద గోదావరి వరద నీరు 25 గేట్లు ఎత్తి 59.267 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుత నీటిమట్టం 70.96 మీటర్లు ఉంది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం సాయంత్రానికి 41.3 అడుగులకు చేరుకొని మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి నీటిమట్టం పెరిగింది. 43 అడుగులకు చేరి, రెండవ ప్రమాద హెచ్చరిక వరకు గోదావరి పెరగవచ్చని సి డబ్ల్యు ఎసి అధికారుల అంచనా. ఇదే క్రమంలో డొంక రాయి రిజర్వాయర్ వద్ద ఎఫ్ఆర్ఎల్ 1037 అడుగుల వద్ద ఉంది. .

మారేడుమిల్లి ఘాట్ రూట్‌లో వాహనాల నిషేధం

భారీ వర్షాలతో ఘాట్ రోడ్డులో చెట్లు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా అధికారులు సాయంత్రం ఏడు గంటల నుండి ఉదయం 6 గంటల వరకు మారేడుమిల్లి చింతూరు రాజమండ్రి వెళ్లే వాహనాలను నిషేధించారు.



ట్రాక్టర్‌పై సురక్షిత ప్రాంతాలకు వెళుతున్న బాధితులు

కూనవరం : గోదావరి, శబరి నదుల సంగమం వద్ద 16 అడుగులు దాటి వరద ఉండడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసారు.వరద ఉధృతి ఇలాగే కొనసాగితే భద్రాచలానికి మండలం నుండి రాక పోకలు నిలిచిపోనున్నాయి. ఇప్పటికే కూనవరం, టేకులబోరు వాసులు అద్దెకు ఇళ్లు తీసుకుని సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు తరలి వెళ్తున్నారు

ఎటపాక : ఎడతెరిపిలేని వర్షాలతో ఎగువ నుండివరద పోటెత్తడంతో గోదావరి నీటిమట్టం హెచ్చరిక స్థాయికి చేరువకొచ్చింది.ఆదివారం సాయంత్రం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 42 అడుగులు చేరింది. గోదావరి నీటిమట్టం పెరగడంతో నెల్లిపాక -వీరాయి గూడెం గ్రామాల మధ్య రహదారిపైకి వరద నీరు చేరుకుంది. వర్షంతో గన్నవరం లో ముమ్మనేని లక్ష్మీ సుభద్ర పెంకుటిల్లు కూలింది.

ట్రాక్టర్ ట్రైలర్‌పై గెడ్డ దాటే సాహసం

అడ్డతీగల : ఏలేరు వాగు ప్రమాద స్థాయిని మించి ప్రవహించడంతో 30 గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేకుండా పోయాయి నిత్యావసరాల కోసం వేటమామిడి పంచాయతీ పలుకూరాతిపాలెం వాసులు ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డను ట్రాక్టర్ ట్రైలర్‌పై ఈదుకుంటూ దాటి ప్రాణసాహసమే చేస్తున్నారు. గతంలో ఇలాంటి చర్యల వల్లే ప్రమాదాలు జరిగి, ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నా గత్యంతరం లేక ఇలా చేస్తున్నామని గిరిజను ఆవేదన చెందుతున్నారు. రూఫ్‌వే బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు. కోనలోవ పంచాయతీ కొచవారి వీధిలోనూ ఇదే పరిస్థితి.

డోలిలో నిండు గర్భిణిని ఆసుపత్రికి..

అడ్డతీగల: మండలంలోని దుష్చర్తి పంచాయతీ పోలవరం గ్రామానికి చెందిన నిండు గర్భిణీకి పురిటి నొప్పులు రాగా, 108 సమాచారమిచ్చినప్పటికీ, డి.వోడవరం తర్వాత రోడ్డు బాగోలేకపోవడంతో అక్కడి వరకు జోరున కురుస్తున్న వానలో, మూడు కిలోమీటర్లు దూరం ఆమెను సమీప బంధువులు డోలిలో మోసుకెళ్లి అక్కడి నుంచి 108లో అడ్డతీగల సిహెచ్‌సికి తరలించారు. రాముళ్ళ సిహెచ్‌సి రావిడ రత్నం, ఇఎంటి అశోక్ కుమార్ పైలెట్ ఎస్‌కె నవాజ్ ఆశ వర్కర్ విజయ ఎంతో సహకరించారని, దీంతో ఆమెకు కష్టంతొలగిందని గర్భిణి కుటుంబసభ్యులు అంటున్నారు.



జి.మాడుగుల బొయితిలిలో నీట మునిగిన పంటపొలాలు

గల్లంతయిన వ్యక్తి మృతదేహం లభ్యం

రంపచోడవరం : మండలంలోని పాతసేతుపల్లి గ్రామం వద్ద చేవల వేటకు వెళ్లి గల్లంతయిన బి వెలమలకోట గ్రామానికి చెందిన సారపు వెంకన్న దొర(45) మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ప్రమాదవశాత్తు వెంకన్నదొర గల్లంతుకాగా, అతని కుమారులు ఇచ్చిన సమాచారం మేరకు ఐటిడిఎ పిఒ సూరజ్‌గనోరే, రంపచోడవరం సబ్‌కలెక్టర్ ప్రశాంత్ కుమార్ ఆదేశాలతో ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు రెండురోజులుగా గాలింపు చర్యలు చేపట్టి, ఆదివారం నాటికి మృతదేహాన్ని గుర్తించాయి. రంపచోడవరం ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

పర్యాటక ప్రాంతాలు మూసివేత

మారేడుమిల్లి:ఎడతెరిపి లేని వర్షాలతో వాగులు వంకలు పొంగి పొర్లడంతో జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ శాఖ అధికారి ఆదేశాల మేరకు మారేడుమిల్లి సిబిఇటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జలతరంగిణి, అమృతధార జలపాతాలు గుడిసె వంటి పర్యాటక ప్రాంతాల సందర్శనను ఆదివారం నుండి నిలిపివేసినట్టు మారేడుమిల్లి రేంజ్ ఆఫీసర్ ఫిరోజ్ ఖాన్ తెలిపారు. తదుపరి ఆదేశాలొచ్చేవరకు పర్యాటకులెవరూ మారేడుమిల్లి రావద్దని సూచించారు.



భద్రాచలం వద్ద 42 అడుగులకు చేరువలో నీటిమట్టం

చెట్టు విరిగిపడి రాత్రంతా బస్సులోనే ప్రయాణికుల పడిగాపులు



చింతూరులోని బాలికల హాస్టల్ పునరావాస కేంద్రంలో బాధితులు

సీలేరు: రేయింబవళ్లు వీడకుండా కురుస్తున్న వర్షాలతో సీలేరు సమీపంలో ఎపి జెన్‌కో చెక్‌పోస్టు వద్ద ప్రధాన రహదారిలో శనివారం రాత్రి భారీచెట్టు కూలి, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో భద్రాచలం నుంచి సీలేరు మీదుగా విశాఖపట్నం వెళ్లే బస్సు రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు సంఘటన ప్రదేశంలోనే ఉండిపోయింది. 30 మందికి పైగా ప్రయాణికులు రాత్రంతా బస్సులోనే పడిగాపులు పడ్డారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకు ఎస్ఐ రామకృష్ణ చొరవతో ఆర్అండ్‌బి అధికారులు జెసిబితో చెట్టును తొలగించి రాకపోకలు పునరుద్ధరించారు. దీంతో విశాఖ ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

బోసిపోయిన వారపుసంత

సీలేరు దారకొండ పరిసర ప్రాంతాల్లో వీడకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలకు బయటకు రాలేని పరిస్థితి ఉంది, దీంతో రవాణా సౌకర్యాలకు అంతరాయం ఏర్పడడంతోపాటు నిత్యవసరాలకు కటకట తప్పలేదు. ఆదివారం సీలేరు వారపుసంతకు వ్యాపారులు రాకపోవడంతో దుకాణాల్లేక బోసిపోయింది. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో భద్రాచలం, కూనవరం తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు రాలేకపోయారు. దీంతో ఒక్కగానొక్క వ్యాపారి కూరగాయలతో రాగా, ఎగబడి కొనుగోలు చేశారు.

ప్రమాదకర వాగుల వద్ద పోలీస్ పహారా

రాజవొమ్మంగి : వర్షాల తీవ్రతకు మండలంలో వట్టిగడ్డ మడేరు లబ్బర్తి పెద్ద కాలువ నెల్లిమెట్ల వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వాటి వద్ద రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ ఎస్ వెంకయ్య ఆధ్వర్యంలో పోలీస్ పహారా ఏర్పాటు చేశారు. రాజువొమ్మంగి గ్రామ శివారు ఒట్టిగడ్డ పొంగి ప్రవహించడంతో రాజవొమ్మంగి శ్రీరామనగర్, శాంతినగర్, వయ్యాడ, బూరుగుపల్లి, ముంజవాప్పాడు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి, దీంతో నిత్యవసరాలు, ఇతర అవసరాలకు వాగు దాటుదామని ప్రయత్నించిన వ్యక్తులను ఆదివారం పోలీసులు అడ్డుకున్నారు. బయటకు తీసుకువచ్చారు. వాటి ఉధృతి తగ్గేవరకు ఎవరినీ అనుమతించేది లేదని స్పష్టం చేవారు.

హుకుంపేట:మండలంలోని చీడిపుట్టు కల్వర్టుపై నీరు అధికంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచి పోయాయి. దీంతో హుకుంపేట మండలంలో మూడు, పాడేరు మండలం మోదపుట్టు పంచాయతీ ప్రజలు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తున్నారు.

అనంతగిరి:గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు జల పాతాలు నిండుకుండలను తలపిస్తున్నాయి. బొర్రా లో కటికి, టోకురులో చిట్టంపాడు, అనంతగిరిలో తాడిగుడ,. సరియా. వంటి జలపాతాలు గత వారం రోజులుగా నిండు కుండలను తలపిస్తున్నాయి.

ముంచింగిపుట్టు:మండలంలోని కరీముక్కిపుట్ పంచాయతీ గ్రామ సచివాలయ సమీపంలోనీ ప్రధాన రహదారికి అడ్డంగా ఈదురు గాలులకు భారీ వృక్షం కూలి నేల మట్టమైంది. గ్రామస్తులు మూడు గంటలు శ్రమించి చెట్టును తొలగించారు.

జి.మాడుగుల: ఎడతెరిపి లేని వర్షాలతో మండలంలో బొయితిలి గ్రామంలో వరి పంట పొలాలు నీట మునిగాయి. పలుచోట్ల వంతెన పైనుంచి నీరు ప్రవహించడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది

బాధిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



ముంపు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శిరీష

కూనవరం : వరద ఉధృతి, ముంపు ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పర్యటించారు. బాధితులను పరామర్శించారు. శబరి కొత్తగూడెం కొండ్రాజు పేట, చిన్నార్యూర్, పంద్రాజ్ పల్లి, కూనవరం, పల్లూరు, టేకుబాక, కాచవరం తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లిసమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు నిత్యవసరాలు, ఇతర సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బరపాటి ప్రకాశరావు, ఎడవల్లి భాస్కరరావు, పొడియం అప్పారావు, సోడే రామయ్య, గడ్డిపాటి ప్రసాద్, హెచ్ రాము, సోడే మధు, గడేసుల రంజిత్, కొక్కిరేణి ఆదినారాయణ ఉన్నారు.



అడ్డతీగలలో గర్భిణిని డోలిలో ఆసుపత్రికి తీసుకెళ్తున్న కుటుంబీకులు

సిపిఎం బృందం సందర్శన

విఆర్.పురం: వీడకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలో అడి వెంకన్నగూడెం, శ్రీరామగిరి, చింతరేగుపల్లి, కన్నాయిగూడెం తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు, ఆదివారం ఆయా గ్రామాలను ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనం సత్యనారాయణ ఆధ్వర్యంలో సిపిఎం బృందం పర్యటించింది. బాధితులను పరామర్శించి, వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాలకు బోట్లు, నాటు పడవలు ఏర్పాటు చేయాలని కోరారు. ముంపు బాధితులను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించాలని, అక్కడ సోలార్‌ల్యాంపులు, బరకాలు, తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారుకార్యక్రమంలో మండల కార్యదర్శి సోయం, చిన్నబాబు మండల నాయకులు సోడి, మల్లయ్య, కారం సుందరయ్య, హజరత్ ప్రకాశరావు ఉన్నారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎంపిపి, సిపిఎం నేతలు

ఆశ్రమాల్లో ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి

- ప్రజాశక్తితో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి ఈ ఏడాది దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు అన్ని తరగతుల్లోనూ ప్రవేశం కల్పించే రీతిలో తగు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు వెల్లడించారు. పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో చేపడుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే ....





సీట్ల పెంపునకు ప్రతిపాదన?.

అవసరం మేరకు సీట్ల పెంపు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన చేశాం. గురుకుల పాఠశాలలో అడ్మిషన్ల కోసం డిమాండ్ ఎక్కువగా ఉంది. ఆశ్రమ పాఠశాలల్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులందరికీ ప్రవేశం కల్పిస్తున్నాం. నెలాఖరు వరకు అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుంది.

జిపిఎస్‌లో ఉపాధ్యాయ ఖాళీ లెన్ని?

పాడేరు డివిజన్లోని (సింగిల్ టీచర్ స్కూల్స్) 667 జిపిఎస్ పాఠశాలల్లో 286 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ప్రస్తుతం రెగ్యులర్ టీచర్లు 240 మంది ఉన్నారు. ఇంకా 180 మంది సీఆర్టీలు పని చేస్తున్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలల పరిధిలో ఉండే ఈ జిపిఎస్‌లలో టీచర్ల ఖాళీలు ఉన్న చోట ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులతో వర్క్ అడ్జస్ట్మెంట్ చేసి ఈ పాఠశాలలను తెరుస్తున్నాం. ఈ ప్రాథమిక పాఠశాలలన్నింటికీ 676 మంది భాషా వాలంటీర్ల నియామకం కూడా పూర్తి చేశాం. ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం త్వరలోనే డీఎస్సీ ద్వారా భర్తీ చేయనుంది. ప్రస్తుతం పాఠశాలల నిర్వహణకు ఆటంకం లేకుండా తగిన చర్యలు తీసుకున్నాం..

ఆరోగ్యం, మెనూపై తీసుకుంటున్న శ్రద్ధ

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థుల ఆరోగ్యం, మెనూ అమలుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఈ సీజన్లో ఆశ్రమ విద్యార్థులకు మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతిరోజు ప్రత్యేక పర్యవేక్షణపై హెచ్ఎం లకు ఆదేశాలు ఇచ్చాం. అనారోగ్యానికి గురయ్య విద్యార్థులను తక్షణమే ఆసుపత్రులకు పంపించి వైద్య కల్పించడంపై కూడా శ్రద్ధ తీసుకుంటున్నాం...

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలకు చేస్తున్న కృషి

ఆశ్రమ పాఠశాలల్లో ప్రతి ఏడాది టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించడం కోసం కృషి చేస్తున్నాం. ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేక చొరవతో టెన్త్‌లో సూపర్ ఫిఫ్టీ బ్యాచ్‌ను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థుల్ని ఎంపిక చేసి ఇందులో ఒక్క బెస్ట్ వన్ విద్యార్థిని గుర్తించి 29 మంది బాలికలకు గుత్తుల పుట్టు ఆశ్రమంలోనూ, 21 మంది బాలురకు దిగు మోదాపుట్ ఆశ్రమంలోనూ ప్రత్యేక భోజన వసతి సదుపాయాలతో పరీక్షల వరకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నాం. గత ఏడాది నుంచి చేపట్టిన ఈ ప్రక్రియ ఆదర్శవంతమైన ఫలితాలను అందిస్తోంది.

కలుషిత ఊటగెడ్డ నీరే దిక్కు

-పని చేయని తాగునీటి పథకం మోటార్ - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:మండలంలోని ఇరగాయి పంచాయతీ మారుమూల వల్దిపనస గ్రామానికి చెందిన ఆదిమజాతి గిరిజనులు (పీవీటీజీ) గుక్కెడు తాగునీటి కోసం నానాపాట్లు పడుతున్నారు. గతంలో గ్రామంలో జల్ జీవన్ పథకం కింద తాగు నీటి బోరు నిర్మించి దాని ద్వారా రక్షిత మంచినీటి అందించే వారు. తాగునీటి మోటార్ మరమ్మతుకు గురై నిరుపయోగంగా మారింది. దీంతో, గ్రామానికి కిలోమీటర్ల దూరంలో వున్న ఊటగెడ్డ నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. జల్ జీవన్ మిషన్ పథకానికి మరమ్మతులు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా పట్టించుకో లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

వల్దిపనస గ్రామంలో సుమారు 30 కుటుంబాలు ,157 మంది ఆదిమజాతి గిరిజన కుటుంబాలు నివాసం వుంటున్నాయి. తాగు నీరు కోసం సమీపంలోని ఊటగెడ్డను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో నీరు కలుషితమైన బురద నీరు తాగి వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి తాగునీటి మోటార్ మరమ్మతు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.



గెడ్డలో నీటిని తోడుకుంటున్న మహిళలు



రికార్డులు పరిశీలిస్తున్న డిఎం అండ్ హెచ్ఒ


పిహెచ్‌సిని తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సి.జమాల్ బాషా ఆకస్మికంగా తనిఖీ చేశారు. అల్లూరి జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మందులు తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం రిజిస్టర్లను తనిఖీ చేశారు. విధులపై నిర్లక్ష్యంగా సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇస్తున్నట్టు ఆయన తెలిపారు. సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో ప్రజలు సీజనల్ వ్యాధులతో ఇబ్బంది పడి వస్తుంటారని తెలిపారు.

వరద ప్రాంతాల్లో మరో 2 రోజులు స్కూళ్లకు సెలవు

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలోని వరద ప్రభావం ఉన్న లోతట్టు ప్రాంతాలైన చింతూరు, విఆర్ పురం, కూనవరం, నెల్లిపాక మండలాల్లో మరో రెండు రోజులు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సూచన మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు ఆయా మండల విద్యా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

విఒఎ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



నగదును అందజేస్తున్న జెడ్‌పిటిసి గంగరాజు, నాయకులు

ప్రజాశక్తి - అనంతగిరి:వెలుగు సంస్థలో పనిచేస్తూ మృతి చెందిన విఒఎ పాంగి శుభాకరరావు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని స్థానిక సిపిఎం జెడ్పిటిసి దిసరి గంగరాజు, వైసిపి ఎంపీపీ శెట్టి నీలవేణి కోరారు. ఎగువశోభ పంచాయతీ గ్రామంలో మృతదేహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి, ఎంపీపీలు మాట్లాడుతూ, డ్వాక్రా సంఘం సభ్యులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ఆయన ఎంతో కృషి చేశారన్నారు.సిబ్బందితో కూడా కలివిడిగా ఉంటూ పని చేసేవారన్నారు.బాధిత కుటుంబానికి జెడ్పీటిసి, ఎంపిపిలు పది వేల ఆర్థిక సహాయం అందించగా వెలుగు ఇన్‌చార్జ్ ఏపిఎం శ్రీరాములు చేతులమీదుగా అందించారు. మృతుని భార్యకు ఉపాధి కల్పించి ప్రభుత్వం కల్పించే రాయితీలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్. కె.సింహద్రి, సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నాగులు, విఒఎ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ బి. విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వసతి గృహ ప్రహరీ నిర్మించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి -అరకులోయరూరల్:కూటమి ప్రభుత్వం స్థానిక వసతి గృహంలో ప్రహరీ గోడ నిర్మించి మహిళల విద్యార్థులకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఎస్ఎఫ్ఐ అరకులోయ నూతన మండల కమిటీ ఎన్నికైంది. మండల అధ్యక్ష కార్యదర్శులుగా శాంతి, అరుణ, ఉపాధ్యక్షులుగా శ్వేత, సహాయ కార్యదర్శులుగా దోస్ రాణి, నందిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కార్తీక్ శ్రీను, కార్యదర్శి జీవన్ కృష్ణ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల వసతి గృహంలో ప్రహరీ గోడ నిర్మాణాన్ని నిలిపేశారన్నారు. కూటమి ప్రభుత్వం వసతి గృహంలో ప్రహరీ గోడ నిర్మించి మహిళల విద్యార్థులకు రక్షణ కల్పించాలన్నారు.ప్రహరి గోడ లేకపోవడంతో వసతి గృహంలోకి ఎద్దులు, కుక్కలు, పాములు వస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బలరాం, విద్యార్థులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

వరద సహాయక చర్యలపై అప్రమత్తం

ఎస్‌పి అమిత్ బర్ధర్

ప్రజాశక్తి-పాడేరు: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలను కాపాడేందుకు, జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్‌పి అమిత్ బర్గర్ తెలిపారు. వరద సహాయ కార్యక్రమాలపై పోలీసు యంత్రాంగం ద్వారా చేపడుతున్న చర్యలను ఆయన ఆదివారం ఒక ప్రకటనలో విలేకరులకు వివరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ముంపు గ్రామాల నిర్వాసితులకు పునరావాస కేంద్రాలు నందిగామ, ఏటపాక మండలానికి గాను నందిగామపాడు గ్రామాలకు గాను ఎంపీపీ ఎస్ స్కూల్ చల్లంపాలెం, మురుమూరు గ్రామానికి గాను ఎంపీపీ స్కూల్ మురుమూరు, నందిగామ గ్రామానికి గాను క్రీస్తు సిలువ చర్చ్ చల్లంపాలెం, వీరయ్య గూడెం నెల్లిపాక గ్రామాలకు గాను జిపిహెచ్‌ఎస్ స్కూల్ నల్లకుంట, కూనవరం మండలానికి గాను కోతులు గుట్ట ఏపీఆర్ స్కూల్, జీబీవీ స్కూల్, వి ఆర్. పురంకి గాను రేఖపల్లి మినీ గురుకులం, కేజీబీవీ స్కూల్‌లో ఏర్పాటు చేశామన్నారు. చింతూరులో ఏపీఆర్ స్కూల్ గర్ల్స్, ఏపీఆర్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముంపు గ్రామాల ప్రజలను రక్షించుటకు గాను టూరిజం బోట్లను, 20 నాటు పడవలను సిద్ధం చేసినట్లు తెలిపారు. పాడేరు జిల్లా పోలీస్ కార్యాలయంలో, కంట్రోల్ రూమ్స్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సహాయక చర్యలు నిమిత్తం డ్రాగన్ లైట్స్, రోప్స్, లైఫ్ జాకెట్స్ వంటి వాటిని సిద్ధం చేసామని చెప్పారు. ప్రమాదాలను నివారించుట కొరకు రోడ్లపై డ్రమ్ములను, స్టాపర్లు ఏర్పాటు చేశామని రెవెన్యూ, విద్యుత్ శాఖలతో సమన్వయం చేసి ప్రమాదాలు నివారించుటకు తగిన చర్యలను తీసుకుంటున్నట్లు అమిత్ బర్గర్ వెల్లడించారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న క్లబ్ ప్రతినిధి

సాధువులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: పట్టణంలోని దేవాలయాల వద్ద భిక్షాటనతో జీవనం సాగించే సాధువులకు పాడేరు వాసవి హిల్స్ క్లబ్ ప్రతినిధి శ్రీనాథ్ శ్రీను దుప్పట్లు పంపిణీ చేశారు. ఆలయాల వద్ద ఆరుబయట జీవనం సాగించే సాధువులకు దుప్పట్లు పంపిణీ చేయడంపై వారు కృతజ్ఞతలు తెలిపారు.

సింహగిరిపై పోటెత్తిన భక్తజనం

ఆఖరి విడత చందన సమర్పణ పూర్తి

ప్రజాశక్తి-సింహాచలం : గిరిప్రదక్షిణ చేసిన లక్షల మంది భక్తులు ఆదివారం ఉదయం సింహగిరికి చేరుకొని అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. గిరి ప్రదక్షిణ చేయలేని భక్తులు కూడా ఆలయ ప్రదక్షిణ చేసేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సింహగిరి భక్తులతో పోటెత్తింది. ఆదివారం వేకువజామునే స్వామివారిని సుప్రభాతంతో మేల్కొల్పి పల్లి ఆరాధన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. చందన సమర్పణ అనంతరం భక్తులకు దర్శనాన్ని కల్పించారు. ఆలయ ప్రదర్శన చేస్తున్న భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా హరినామ స్మరణతో గిరిప్రదక్షిణను పూర్తి చేశారు. గిరిప్రదక్షిణలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతం కావడంపై దేవస్థానం అధికారులు జిల్లా అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. అందరి సమన్వయంతో ఈ ఉత్సవం విజయవంతమైందని ఆలయ వర్గాలు ఆనందాన్ని వ్యక్తం చేశాయి.

సమస్యలపై జాతీయ ఎస్‌టి కమిషన్ మెంబర్‌కు వినతి

ప్రజాశక్తి- గాజువాక : భెల్ హెచ్‌పివిపి ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ సభ్యులు ఆదివారం జాతీయ ఎస్‌టి కమిషన్ మెంబర్ హుస్సేన్‌ను కలిసి సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కంపెనీలోని ఎస్‌సి, ఎస్‌టి కార్మికులు తగు న్యాయం చేయాల్సిందిగా కోరారు. దీనికి హుస్సేన్ స్పందిస్తూ తగు న్యాయం జరిగేలా కృషిచేస్తానన్నారు. ఆయనను కలిసిన వారిలో కొల్లి దేవుడు తదితరులున్నారు.

పునరావాస కేంద్రాలకు తరలించండి

కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: గోదావరి, శబరి నదుల ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో మొదటి హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. వరద ప్రభావిత నాలుగు మండలాలలో లోతట్టు ప్రాంతాల ప్రజలను గుర్తించి వెంటనే వారిని ఎత్తయిన ప్రదేశాలకు, పురావస కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ఆదివారం కలెక్టర్ అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏ ఒక్కరికి ఎటువంటి సమస్య రాకూడని విధంగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అవసరమైన సరుకులు సరఫరా చేయడంతో పాటు వంటకి అవసరమైన కుక్‌లను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసులు పరస్పర సహకారంతో రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అవసరమైన కిరోసిన్, డీజిల్, పెట్రోల్, ట్రాక్టర్లు, టార్చ్ లైట్ లు, జనరేటర్లు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఆయా మండలాల్లో కమాండ్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి 24 గంటలు పని చేసేలా షిఫ్టుల వారీగా విధులు కేటాయించాలని ఆదేశించారు. వరదల నేపథ్యంలో ప్రత్యేక విదులు కేటాయించిన సిబ్బంది అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు చేపట్టిన కార్యక్రమాలపై ఆరా తీశారు. ముంపునకు గురికాని గ్రామాలలో విద్యుత్ సరఫరా ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. మంజూరు చేసిన బోర్ వెల్స్ పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని, అవసరమైన వాటర్ ప్యాకెట్లు, బ్యాగులను సరఫరా చేయాలని ఆదేశించారు.

చింతూరు ఐటీడీఏ పీవో చైతన్య స్పందిస్తూ శనివారం నాటికి ఐదు రహదారులు బ్లాక్ అయ్యాయని, ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. హాస్టల్స్ 70 శాతం పైగా విద్యార్థులు వారి వారి ఇళ్లకు చేరుకున్నారని మిగిలిన 30 శాతం మందిని సురక్షిత ప్రాంతాల్లో గల వసతి గృహాలకు విద్యార్థులను తరలించామని తెలిపారు. పాడేరు నుండి పోలీసు బందాలు చేరుకుంటున్నాయని, అవసరమైన జనరేటర్లు స్థానికంగా సమకూర్చడం జరిగిందని, బోట్లు, ట్రాక్టర్లు సిద్ధం చేశామని తెలిపారు.

రంపచోడవరం ఐటిడిఏ పిఓ సూరజ్ గనోరే మాట్లాడుతూ, కంట్రోల్ కేంద్రాలు ఏర్పాటు చేశామని అవసరమైన సిబ్బందిని నియమించామన్నారు. మొబైల్ టవర్లు అన్ని పనిచేస్తున్నాయని తెలిపారు. ఎస్పీ అమిత్ బర్ధర్ మాట్లాడుతూ, ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డి ఆర్‌ఎఫ్ బృందాలు చేరుకుంటున్నాయని, కమ్యూనికేషన్ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.ఆయా బృందాలలో రెవెన్యూ లేదా ఇరిగేషన్ శాఖల అధికారులు, సిబ్బందిని కేటాయించాలని కోరారు. గర్భిణీలు బాలింతలపై ప్రత్యేక దష్టి సారించి ముందుగా వారిని తరలించే విధంగా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. కలెక్టర్ స్పందిస్తూ రియల్ టైం సమాచారాన్ని అందించాలని ఎటువంటి విమర్శలకు తావు లేకుండా అన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల తహసిల్దార్లు, ఎంపీడీవోలు, వరద సహాయక బృందాలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వంతెన అప్రోచ్ రోడ్డుకు కోత



కోతకు గురైన గోరాపూర్ వంతెన అప్రోచ్ రోడ్డు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలో గత ఐదు రోజులుగా భారీ వర్షం కురుస్తుంది. ఈ వర్షాల ఉదృతికి మండలంలో నూతనంగా నిర్మించిన సరాయి రోడ్డు గోరాపూర్ వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురైంది. కితలంగి రోడ్డు కోసం గూడ వంతెన కొంత భాగం కొట్టుకు పోయింది. గెడ్డలు పొంగి ప్రవహిస్తుడటంతో పెదపాడు, కితలంగి, కించమండ, కోసంగి ప్రాంతాల గిరిజనులకు రాకపోకలు స్తంభించి పోవడంతో నిత్యావసర సరుకులు కోసం వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా బయటికి రాలేక ఉన్న పెదపాడు గ్రామస్తులకు చాపరాయి జలపాతం గెడ్డలో తాళ్ల సాయంతో గేడ్డను దాటించారు.కోతకు గురైన కోసంగుడ, గోరపూర్ వంతెనలను స్థానిక సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతురాజు, మండల నాయకుడు టి.సూర్యనారాయణ పరిశీలించారు.

కోసంగుడ వంతెన కోతకు గురవడంతో కితలంగి పంచాయతీ గిరిజనులకు రాకపోకలు స్తంభించి పోయాయన్నారు. నూతనంగా నిర్మించిన గోరపూర్ వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మించక పోవడంతో వరద ఉదృతికి కొట్టుకు పోయిందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కోతకు గురైన వంతెనలను మరమత్తు పనులు చేపట్టి గిరిజనుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన లారీ

క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్

ప్రజాశక్తి -గాజువాక : అక్కిరెడ్డిపాలెంలోని జాతీయ రహదారిలో ఆగి ఉన్న టిప్పర్‌ను లారీ ఢీకొట్టడంతో డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఆదివారం సాయంత్రం జరిగిన ఘటనకు సంబంధించి స్థానికుల కథనం ప్రకారం... విశాఖ ఎన్‌ఎడి వైపు నుంచి గాజువాక లోడుతో వచ్చిన ఒక లారీ అక్కిరెడ్డిపాలెం జాతీయ రహదారిపై మరమ్మతుకు గురై నిలిచిపోయింది. అదే రోడ్డులో ఎన్‌ఎడి వైపు నుంచి మరో లారీ ఖాళీగా వస్తూ అదే ప్రాంతంలో అడ్డుగా వచ్చిన కారును తప్పించబోయి ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో లారీ క్యాబిన్ నుజ్జు అయింది. ఈ ప్రమాదంలో డ్రైవరు క్యాబిన్‌లో ఇరుక్కుపోయి రెండు కాళ్లు విరిగిపోయాయి. క్రేన్ సహాయంతో డ్రైవర్‌ను బయటికి తీయడానికి మూడు గంటల సమయం పట్టింది. ఈ లోగా డ్రైవరు 'నన్ను రక్షించండి' అంటూ పెట్టిన ఆర్తనాదాలు అందరినీ కంట తడి పెట్టించింది. జాతీయ రహదారిపై ప్రమాదం జరగడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. సాయంత్రం నాలుగు గంటలకు ప్రమాదం జరిగిన నుంచి 7 గంటల వరకు షీలానగర్ నుంచి పాత గాజువాక జంక్షన్ వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఏడు గంటల తర్వాత ట్రాఫిక్ క్లియర్ అయింది.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -మధురవాడ : పోతినమల్లయ్యపాలెం పోలీసు స్టేషన్ పరిధిలోని యువతి అదృశ్యమైనట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... జివిఎంసి 6వ వార్డు పరిధిలోని సాయిప్రియ గార్డెన్స్‌కు చెందిన యువతి వాసవి ఈ నెల 20వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లేకపోవడంతో యువతి తండ్రి రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

14 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న గొలుగొండ గ్రామానికి చెందిన మైనర్ యువకుడుని అరెస్టు చేసినట్లు నర్సీపట్నం రూరల్ ఎస్సై భీమరాజు తెలిపారు. గొలుగొండ మండలం అదే గ్రామానికి చెందిన మైనర్ పదో తరగతి చదివి మానేశాడన్నారు. విశాఖ ఏజెన్సీ నుంచి 14 కేజీల గంజాయి కొనుగోలు చేసి తరలిస్తుండగా ధర్మసాగరం జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొనసాగిన భూ బాధితుల ఆందోళన

ప్రజాశక్తి- పిఎం పాలెం : కొమ్మాది, బక్కన్నపాలెం, రేవల్లపాలెం రైతులు తమకు నష్ట పరిహారంగా ఇస్తామన్న ఇళ్లను వెంటనే ఇవ్వాలని కోరారు. ఆదివారం వర్షాన్ని సైతం లెక్క చెయ్యకుండా బాధితులు బక్కన్నపాలెం నవోదయ విద్యాలయం వద్ద ఉన్న హుదూద్ ఇళ్ల ముందు ధర్నా కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భూములు కోల్పోయిన రైతులకు ఇళ్లు ఇస్తామని అధికారులు,ప్రజా ప్రతినిధులు ఇచ్చిన మాటను నిలబెట్టు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దలు బి.పోతురాజు, ఎస్.పైడి, కెవిపిఎస్ నాయకులు ఎస్.పైడితల్లి, రైతులు శేయాద్రిరాజు, ఎస్.నాగేశ్వర్, బి.అప్పారావు, ఎస్.కాంతం, నరసియ్యమ్మ, గురయ్య, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రేవళ్లపాలెం బాధితుల వినతి

ప్రజాశక్తి -పిఎం.పాలెం : జివిఎంసి ఆరో వార్డు పరిధి రేవళ్లపాలెం రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని స్థానిక టిడిపి నేతలు నాగోతి వెంకట్రావు, పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యాన బాధితులు ఆదివారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును వినతి పత్రం అందజేశారు. ఇటీవల రేవళ్లపాలెంలో 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణలో భాగంగా 32మంది తమ నివాసాలను కోల్పోయారని, భూములు కోల్పోయినందుకు 1:4వ వంతు టిడిఆర్ నష్ట పరిహారాన్ని గత ప్రభుత్వం అందిస్తూ బిల్డింగ్ కాంపన్‌సేషన్ ఇస్తామని నమ్మించి నిర్మాణాలను ఏడాది క్రితం తొలగించారని వివరించారు. వారిచ్చిన బిల్డింగ్ కాంపన్‌సేషన్ తమ ఇంటి అద్దెలకే సరిపోలేదని తెలిపారు. బాధితులకు ఏటువంటి నష్ట పరిహారాన్నీ అందించలేదని అవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించి టిడిఆర్, నివాసం కోసం టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని గంటా శ్రీనివాసరావును కోరారు. ఈ కార్యక్రమంలో పిల్లా రమణ, బాధితులు పాల్గొన్నారు.



వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్

వాగులు వద్ద అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని మారుమూల గ్రామాల ప్రజలు వాగులు దాటేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్ సూచించారు. ఆదివారం రంపచోడవరం మండలం ఐ పోలవరము సీతబెల్లి కాలువ, గంగవరం మండలం నెల్లిపూడి కాల్వ, అడ్డతీగల మండలం పైడి పుట్ట కాలువలను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాలకు కాలువల్లో వరదనీరు ఉధృతగా ప్రవహిస్తోందని, వాటి వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముఖ్యమైన కాలువల దగ్గర రెవెన్యూ, మండల పరిషత్ సిబ్బంది, పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.. కాలువలు పొంగేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను కాలువ దాటినీయవద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాలు తగ్గి, వాగులు తగ్గేవరకు తగు జాగ్రత్తలు తీసుకునేలా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. పోలవరం కాలువలో దిగి దాటేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అడ్డుకున్నారు భారీ వర్షాలతో రహదారులపై చెట్టుకూలడం, ఇతర అవాంతరాలు ఏర్పడితే, ఆయా సమస్యల సత్వర పరిష్కారానికి తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సంబంధిత ఇంజనీర్లు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సబ్ కలెక్టర్ వారి వెంట తహశీల్దారులు సత్య సులోచన, నాగమణి, డిప్యూటీ తహశీల్దార్లు బి.రాజు వీరభద్రరావు, ఎంఆర్ఐ జిలాని పాల్గొన్నారు.

అన్నసమారాధన

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. బాబాకు ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. నగర సంకీర్తనలు నిర్వహించారు. దాతలు సహాయంతో అన్నసమారాధన నిర్వహించారు. **రాజవొమ్మంగి :** స్థానిక షిరిడి సాయిబాబా ఆలయం వద్ద గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదానం నిర్వహించారు. భజనలు, నగర సంకీర్తనలు, పల్లకి ఊరేగింపు నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు టి వీర్రాజు, గుప్తా, ఎం వెంకటేశ్వరరావు, సావిత్రి, లక్ష్మి, అమ్మాజీ, వేణి, సత్యవతి, రాణి, నారేం లింగేశ్వరావు దంపతులు పాల్గొన్నారు.



జోరుగా సాగుతున్న పారిశుధ్య పనులు

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-విఆర్ పురం: మండలంలో వడ్డిగూడెం గ్రామపంచాయతీ వి ఆర్ పురం, వడ్డుగూడెం కాలనీ, ధర్మతాల గూడెం, గ్రామాలలో వీడకుండా కురుస్తున్న వర్షాలు, గోదావరి, శబరి పొంగడంతో చేరిన బురదతో పారిశుధ్యం క్షీణించకుండా సర్పంచ్ నరసమ్మ,, సెక్రటరీ స్వరూపారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పారిశుధ్య పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చెత్తాచెదారం తొలగించడంతోపాటు దోమల నివారణ చర్యల్లో భాగంగా బ్లీచింగ్ చల్లారు. ఇంటిచుట్టూ నీరు నిల్వ లేకుండాచూసుకోవాలని, దోమల నుంచి రక్షణ చర్యలు చేపట్టాలని, అనారోగ్యం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, లేకుంటే తమకు సమాచారమిస్తే తగు చర్యలు చేపడతామని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

గ్రేటర్‌లో వైసిపికి షాక్

టిడిపిలోకి ఏడుగురు, జనసేనలోకి ఐదుగురు కార్పొరేటర్లు చేరిక

మేయర్ పదవిపై కూటమి కన్ను

స్థాయి సంఘంపై పాగా లాంఛనమే..

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలోని అతి పెద్దదైన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జివిఎంసి)పై కూటమి నాయకులు కన్నేశారు. అనుకున్నదే తడువుగా స్థానిక తెలుగుదేశం, జనసేన నాయకులు చక్రం తిప్పారు. జివిఎంసిలో వైసిపిని చావు దెబ్బ కొట్టారు. కొద్దిరోజులుగా విశాఖలోని టిడిపి, జనసేన నాయకులు చేసిన ప్రయత్నాలు ఫలించడం, ఒకేసారి తమపార్టీకి చెందిన 12 మంది కార్పొరేటర్లు పార్టీ ఫిరాయించడం వైసిపికి ఊపిరిసలపనివ్వడం లేదు. జంప్ అయిన వారిలో ఏడుగురు తెలుగుదేశం పార్టీలో, ఐదుగురు జనసేన పార్టీలో చేరారు. దీంతో జివిఎంసిలో బలబలాలు మారిపోయాయి.

గడ్డు పరిస్థితిలో వైసిపి

కొద్దిరోజుల్లో మరి కొంతమంది వైసిపి కార్పొరేటర్లు కూటమిలోని పార్టీలలో చేరనున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే జివిఎంసిలో గత మూడున్నరేళ్లగా పాలన సాగిస్తున్న వైసిపి మరింత గడ్డు పరిస్థితి నెలకొంటుందని చెప్పవచ్చు. జివిఎంసి పాలకవర్గానికి 2021 మార్చి 16న ఎన్నికలు జరిగాయి. జివిఎంసిలో 98 మంది కార్పొరేటర్ల పదవులకు ఆ ఎన్నికలు సాగగా వైసిపి అత్యధిక స్థానాలను గెలుపొంది మేయర్ పీఠం కైవసం చేసుకుంది. టిడిపికి 30 స్థానాలు దక్కగా, జనసేన రెండు చోట్ల, బిజెపి ఒకచోట, సిపిఎం, సిపిఐ ఒక్కొక్క చోట గెలుపొందాయి. ఇండిపెండెంట్లు నాలుగు చోట్ల గెలుపొందారు. అనంతరం మారిన రాజకీయ పరిస్థితులలో టిడిపి 31వ వార్డు కార్పొరేటర్ మృతి చెందడంతో ఉప ఎన్నికల్లో వైసిపి గెలిచింది. అలాగే దక్షిణ నియోజకవర్గానికి చెందిన ముగ్గురు ఇండిపెండెంట్ అభ్యర్థులు ప్రారంభంలో వైసిపిలో చేరారు. ఆ తర్వాత వారు జనసేనలోకి మారారు. దీంతో జనసేన బలం ఐదుకు చేరింది. అలాగే వైసిపికి చెందిన 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు ఆ పార్టీకి దూరమై బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉండే సీతంరాజు సుధాకర్‌తో కలిశారు. ఆ తరువాత సుధాకర్ ఆ పార్టీని వీడి టిడిపిలో చేరడంతో కార్పొరేటర్ నారాయణరావు కూడా ఆయనతో కలిశారు. అలాగే టిడిపి నుంచి 41వ వార్డులో గెలుపొందిన కోడిగుడ్ల పూర్ణిమ వైసిపిలో చేరారు. ఈ ఏడాది మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో దక్షిణ నియోజవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా పోటీ చేసిన సిహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అంతకుముందు 21వ వార్డు వైసిపి కార్పొరేటర్‌గా ఉండేవారు. ఆయన రాజీనామా చేసి జనసేనలో చేరారు. ఈ సమీకరణల నేపథ్యంలో కౌన్సిల్‌లో అధికార వైసిపి బలం 58కి తగ్గింది. ఇప్పుడు 12 మంది కార్పొరేటర్లు టిడిపి, జనసేన పార్టీలలో చేరడంతో వైసిపి బలం 46కి పడిపోయింది. టిడిపి బలం 37కు, జనసేన బలం 10కి పెరిగింది. కూటమిలో భాగస్వామిగా ఉన్న బిజెపికి కూడా జివిఎంసిలో ఒక కార్పొరేటర్ ఉన్నారు. అదీ కలిస్తే కౌన్సిల్లో కూటమి బలం 48కి చేరుతుంది. ఈ లెక్కన చూస్తే కౌన్సిల్‌లో వైసిపి కంటే కూటమికి ఇద్దరు కార్పొరేటర్లు అధికంగా ఉన్నట్లే. మరికొద్ది రోజులలో వైసిపి నుంచి మరికొంతమంది కార్పొరేటర్లు టిడిపి, జనసేన పార్టీలలో చేరనున్నట్లు తెలిసింది. అది కూడా జరిగితే కౌన్సిల్‌లో వైసిపి పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంది.

పావులు కదుపుతున్న కూటమి :
చట్టం వల్ల కొద్ది నెలలు వేచి చూడాల్సిందే..

మొత్తం ఈ వ్యవహారాన్ని గమనిస్తే జివిఎంసిపై కూటమి జెండా ఎగురనుందన్న విషయం అర్థమవుతోంది. మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాసం పెట్టి ఆ పదవులను కూడా కైవసం చేసుకోవాలని, స్టాండింగ్ కౌన్సిల్‌లో ఆధిపత్యం సాధించాలని కూటమి నాయకుల ఆలోచనగా ఉంది. అయితే మేయర్, డిప్యూటీ మేయర్‌లపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు చట్టం అనుమతించదు. పాలకవర్గం ఏర్పడిన నాలుగు సంవత్సరాలు పూర్తి అయితే తప్ప మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేదు. వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రారంభంలోనే ఆ చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ప్రకారం చూస్తే ప్రస్తుతం జివిఎంసిలో అధికారంలో ఉన్న వైసిపి మేయర్ పదవీకాలం మూడు సంవత్సరాల నాలుగు మాసాలు పూర్తి అయ్యింది. మరో ఎనిమిది మాసాలు పూర్తయితే తప్ప అవిశ్వాసం పెట్టే అవకాశం లేదు. అయితే ఈలోగా స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో కూటమి ఆధిపత్యం సాధించడం తథ్యం. జివిఎంసిలో ఏదైనా అభివృద్ధి పనులు ప్రతిపాదించాలన్నా, వాటిని అమలు చేయాలన్నా, అందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలన్నా స్టాండింగ్ కౌన్సిల్ తీర్మానాలు ముఖ్యం. అదే సందర్భంలో ప్రస్తుత పాలకవర్గం స్టాండింగ్ కౌన్సిల్‌లో చేసిన పలు అభివృద్ధి పనులను రద్దు చేసే అవకాశం కూడా కొత్తగా ఎన్నికయ్యే స్టాండింగ్ కౌన్సిల్‌కు ఉంటుంది. అందుకే ముందుగా స్టాండింగ్ కౌన్సిల్‌ను కైవసం చేసుకొని, ఆ తర్వాత మేయర్ పదవిని కూడా పొందాలని కూటమి నాయకుల అభిప్రాయంగా ఉంది.

వైసిపి అరాచకాలు భరించలేకే

కార్పొరేటర్లు పార్టీ మారారు : పల్లా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఐదేళ్ల పాటు రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం సాగించిన అరాచకాలను భరించలేకే వైసిపి కార్పొరేటర్లు 12 మంది ఆదివారం ఆ పార్టీని విడిచి కూటమి పార్టీలలో చేరారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైసిపి నుంచి వచ్చిన కార్పొరేటర్లకు ఆయన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము ఏ ఒక్క కార్పొరేటర్‌నూ బలవంతం చేయలేదని, వారే స్వచ్ఛందంగా వచ్చి చేరారని చెప్పారు. పార్టీ మారి వచ్చిన వారు కూటమి పార్టీల సిద్ధాంతాలు, ఆశయాలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుందన్నారు. అలాగే పార్టీలు మారిన కార్పొరేటర్లు ఉన్న ప్రాంతాలలో ప్రారంభం నుంచి తెలుగుదేశం పార్టీలో పనిచేస్తున్న నాయకులు మనస్థాపానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. అయితే వారు అటువంటి ఆలోచన చేయవద్దన్నారు. అటువంటి వారికి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్పొరేటర్లు వారి వారి ప్రాంతాలలో ప్రజల విశ్వాసాన్ని పొంది గెలుపొందారని, నిత్యం వారు ప్రజలతో కలిసి, మెలిసి ఉంటారని, స్థానిక సంస్థలపై వారికి పూర్తి అవగాహన ఉంటుందని చెప్పారు. అటువంటి వారి వల్ల పార్టీకి బలం చేకూరుతుందన్నారు.

డోర్స్ ఓపెన్ చేస్తే జివిఎంసి కౌన్సిల్‌లో వైసిపి మొత్తం ఖాళీ అవుతుందన్నారు. దక్షిణ జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు జగన్ పాలనను, వైసిపి పాలనను తరిమికొట్టారని చెప్పారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ వైసిపిలో మచ్చలేని, అరాచకాలు చేయని కార్పొరేటర్లను మాత్రమే టిడిపి, జనసేన పార్టీల్లోకి చేర్చుకోవడం జరుగుతుందని చెప్పారు.



పెరిగిన నీటితో సీలేరు రిజర్వాయర్

ప్రమాదస్థాయికి సీలేరు గుంటవాడ రిజర్వాయర్

సీలేరు: కొన్నాళ్లుగా వీడకుండా కురుస్తున్న భారీ వర్షాలకు సీలేరు కాంప్లెక్స్ పరిధి సీలేరు గుంటవాడ రిజర్వాయర్‌లో నీటిమట్టం ప్రమాద స్థాయికి చేరువ కావడంతో ఎపి జెన్‌కో అధికారులు అప్రమత్తమయ్యారు. సిబ్బందిని అప్రమత్తం చేశారు. గుంటవాడ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1360 అడుగులు కాగా, ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పిల్లి గెడ్డ, ఐసగెడ్డ నుంచి ఇన్‌ఫ్లో అధికంగా వచ్చి రిజర్వాయర్‌లో చేరుతుండడంతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటల సమయానికి 13 55 అడుగులు నీటిమట్టానికి చేరుకుంది. మరొక నాలుగు అడుగులు పెరిగి, 1359అడుగులకు చేరుకుంటే గుంటవాడ రిజర్వాయర్ నుంచి గేట్లు ద్వారా దిగువ ప్రాంతానికి నీటిని విడుదల చేయడానికి సిబ్బందిని రిజర్వాయర్ వద్ద అప్రమత్తంగా ఉండాలని ఎపి జెన్‌కో ఇఇ ప్రభాకర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఇఇ ప్రభాకర్ మాట్లాడుతూ, క్యాచ్‌మెంట్ ఏరియా పిల్లిగెడ్డ, ఐసు గెడ్డ నుంచి మూడు వేల క్యూసెక్కులకు పైగా వరదనీరు రిజర్వాయర్‌లో చేరడంతో గరిష్టస్థాయికి చేరుకునే పరిస్థితి ఉందన్నారు. దీంతో రిజర్వాయర్ దిగువనున్న ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రజలకు అప్రమత్తం చేయాలని తహశీల్దార్, స్థానిక పోలీసుస్టేషన్‌కు, ఒడిషా మల్కనగిరి జిల్లా గుంటవాడ, సీలేరు సర్పంచ్‌లకు సమాచారం అందించమన్నారు. రిజర్వాయర్‌లో నీరు ప్రమాదస్థాయికి చేరితే ఏ క్షణంలోనైనా గేట్లు తెరిచి దిగువకు విడుదల చేస్తామని హెచ్చరించారు.

బ్యాంకు అకౌంట్‌లో నగదు మాయం

ప్రజాశక్తి - సీలేరు: జీకే వీధి మండలం మొండిగెడ్డ పంచాయతీ తోటలగొంది గ్రామానికి చెందిన కే .మనోహర్ నాథ్‌కు చెందిన యూనియన్ బ్యాంక్ అకౌంట్ నుంచి రూ..9200 నగదు మాయమైందని బాధితుడు ఆవేదన చెందుతున్నాడు.ఈనెల 17 తేదీన యూనియన్ బ్యాంక్ వెళ్లి డబ్బులు డ్రా చేద్దామని చూస్తే, ఖాతాలోని రూ. 9200 నగదు సైబర్ నేరగాళ్లు డ్రా చేశారన్నారు. అంతకుముందు తనకు ఫోన్ కాల్ చేసి హిందీలో ఏదో మాట్లాడారని, ఎవరో, ఏం మాట్లాడుతున్నారో తనకు తెలియదని ఫోన్ కట్ చేశానన్నాడు. అనంతరం మూడు మెసేజ్‌లు వచ్చాయని, తనకు తెలియకుండానే తనఖాతాలోని ఇపిఎంఎస్ ద్వారా రూ. 9200 కొట్టేశారని బాధితుడు అంటున్నాడు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - రంపచోడవరం : భారీ వర్షాల కారణంగా ఈనెల 22న సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు చేస్తున్నట్టు రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే తెలిపారు. ఈ విషయాన్ని ఏజెన్సీలోని గిరిజనులు గమనించాలని సూచించారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ప్రతిష్టాత్మకమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోరాటాలతో కాపాడుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ విశాఖ జిల్లా ప్లీనం స్థానిక శివాజీపాలెంలోని సవేరా ఫంక్షన్ హాలులో ఆదివారం పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన లోకనాథం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తుపై అటు కార్మికులు, నిర్వాసితులు, ఇటు ప్రజానీకంలో ఆందోళన నెలకొందన్నారు. మూడున్నరేళ్లుగా ఉక్కు పరిశ్రమను రక్షించుకోవడానికి జరుగుతున్న ఆందోళనకు సిపిఎం అండగా నిలిచిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఎన్‌డిఎ కూటమి పక్షాలైన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఒత్తిడి తెచ్చి ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. వేదికపై సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, తదితరులు ఉన్నారు.